

# అబ్బాయి జబ్బు

శ్రీ "గిరి"

"కోడల్ని పిలుచుకొచ్చారట్నే"

"ఆ—మూడు నెలలైంది"

"మూడు నెలలైందీ! మాకు తెలియదేమ్మా"

"ఎలా తెలుస్తుందీ. మీరు వూళ్ళో లేరుగా అప్పుడు"

"అబ్బాయినీ అడిగానే ఓమారు. చెప్పలేదే?"

"అయితే పెళ్లాం వచ్చిందని వూరంతా చాటుతాడా!"

"చాటక పోవచ్చు. ఇల్లు రాత్రిళ్లు వదలడం మానడూ"

"వాడోరకం"

"ఏం రకమోనమ్మా. అయినానూ నాకేం నచ్చడంలా మీవాడి వ్యవహారం"

"…………"

"ఏమో జబ్బనికూడా అన్నారు. డాక్టరుకు చూపించారా. ఏం చెప్పాడు?"

"లే. ఇవాళే కనుక్కోపోతున్నా"

౨

"బాబూ అబ్బాయికేమండీ జబ్బు"

"జబ్బు విషయం ఎందుకమ్మా మీకు, నయం చేస్తానంటుంటే!"

"అయినా చెప్పండురూ!"

"ఆమె అంతేనండి మీరు వూరుకోండి డాక్టరుగారు"

"అబ్బాయీ తెలుసుకొంటే ఏంరా?"

"ఎందుకే!? తెలుసుకొని ఏం చేస్తావే!"

"ఏడుస్తా. ఎప్పుడూ ఇంతేనీవు. బాబూ వాడి మాటలకేంగాని మీరు శెలవియ్యండి!"

"అబ్బబ్బ! చెప్తేగాని వదలనట్టున్నారే!"

"విసుక్కోకండి. ఏందో పెద్దదాన్ని. భయం. వీడు ఒక్కడేనాకు!"

"ఏం ప్రమాదంలేదమ్మా. అబ్బాయికి కొంచెం ఆడవాళ్ళ జబ్బు…"

"ఆ…ఆ……"

౩

"ఒసేయ్! ఒసేయ్!"

"ఏం అత్తా!"

"ఏముంది. నేను అనుకొన్నంతా అయింది!"

"…………"

"నేనందుకే మొత్తుకొంటున్నా, ఇన్నాళ్లు మొగాడికండ్లకు అందంగా కనబడాల్నే అని!"

"…………"

"నిన్నని ఏం ప్రయోజనం? ఆ నిన్ను కని పెంచినవాళ్ళను అనాలిగాని! ఇంతకూ ఎవర్ననడం ఎందుకు నా ప్రారబ్ధం ఇలావుంటే!"

"…………"

"నీవు వాణ్ణి సరిగ్గా ఉంచుకోని, నీవలలో వేసుకొంటే వాడు ముండల వెంబడి ఎందుకు పడతాడూ, యీ జబ్బెందుకు తెచ్చుకొంటాడూ?"

"…………"

"తెలివిలేని ఘటం దొరికావు!"

"…………"

"ఏడిస్తే ఏం ప్రయోజనం? ఎవరు చేసుకొంది వాళ్లనుభవించాలి!"